# పెనం

"ఏదీ ... ఒక్కసారి గిల్లవే..?!' సుబ్బారావు గట్టిగా కళ్ళుమూసుకొని ఒళ్ళిచ్చాడు.

చిటుక్కుమని గిల్లింది సావిత్రి.

'చిటుక్.. పుటుక్' మని గిల్లారు పిల్లలు సునీత, వినీత్.

'అమ్మో' కళ్ళు తెరిచి అరిచాడు సుబ్బారావు.

'వేడిగా వుందేంటండి...?'' కంగారు పడి సుబ్బారావు చేతిలోని అట్టుతో వున్న ప్లేటును అందుకోబోయింది సావిత్రి. విడువ లేదు సుబ్బారావు. పిల్లలు' తల్లి వెనక్కి నక్కారు.

'' నా కొడుక్కి ముక్కలు తీస్సినార్రో.. కంగ్రసీమలు'' తిడుతూ అరుగు మీది నుంచి ఇంట్లోకి వచ్చింది నారాయణమ్మ. మనమల్ని తిడితే తనకే తగిలినట్టయి ప్లేటు వదిలేసింది సావిత్రి.

''ఎలాగుందిర నాయినా? ... ఏటయ్యింది?'' నారాయణమ్మ కొడుకుని అడిగింది.

''చాలా బాగా టేస్టుగా వుంది'' తింటున్న అట్టును తల్చుకుంటూ సుబ్బారావు.

''బాగుందండీ...!'' ఆనందంగా కళ్ళు తిప్పబోయింది సావిత్రి.

''ఏమిటి నువ్వు చేసినవే... పేపరు దోసె? ... కాదు ఉల్లిపొరతో.. ఆహాఁ... నేన్నమ్మను.. నమ్మలేను..'' సుబ్బారావు తన్మయత్వాన్ని తట్టుకోలేక లాలాజలం నోట్లోంచి గెంతేస్తోంది.

''ఎల అలాటివి తట్టి మానిదు తింతేగాని కడుపు నిండుతాదేట్రా? అప్పుకప్పూరమని... అప్పు కప్పూరమని...'' గొణుక్కుంది నారాయణమ్మ.

''రోజూ ఇలాగే దంచికొట్టు...'' కళ్ళతో అభినందిస్తూ నోటితో ఆర్డరు వేసాడు సుబ్బారావు.

"కుదరదు... కుదరదు?" అంది తల్లి పైటవొదిలి సునీత.

"ఏం? ఎందుకు కుదర్దు?" సుబ్బారావు పాలమారేడు. నారాయణమ్మ సుబ్బారావు నెత్తిమీద మెత్తగా మొత్తింది.

"పంకజమత్త అరగంటలో అట్లు పెనం ఇచ్చీమంది" అన్నాడు వినీత్.

"ఏం మన అట్టుల రేకేమయిందర్రా?" నారాయణమ్మ వెతకడానికేమో వంట గదిలోకి వెళ్ళింది.

"మన రేకు మీద అట్లు కాదు కుడుములు పెట్టొచ్చు" వినీతన్న మాటను ఆమె పట్టించుకున్నట్టు లేదు.

"అమ్మ ఎప్పట్నుంచో అలాంటి పెనం కొనమంటోంది కదా నాన్నా..."

రాయభారాన్ని ప్రారంభించింది సునీత.

"నువ్వు పుట్టకముందునుంచీనే అమ్మా" కూతురుతో అంది సావిత్రి. ఇంతలో "పేను.. వదినా పేను..." పంకజం వీధిలోంచే కేక.

"ఫేనా? వాళ్ళ ఫేనేమయ్యింది?" సుబ్బారావు అయోమయంలో పడ్డాడు.

"ఎఫ్ ఎ ఎన్ - ఫేను కాదు పిఏ ఎన్ పేన్" గొప్పగా చెప్పాడు వినీత్.

"తమ్ముడూ పేను కాదురా పాన్. అంటే బాణలి. నాన్నా పాన్ అంటే పెనం ఎలాగవుతుంది?' ' అడిగింది సునీత.

అప్పటికే సావిత్రి పొయ్యిమీది వేడి పెనాన్ని తెచ్చి సుబ్బారావు ముఖం మీద పెట్టి 'ఇచ్చేస్తున్నా' పంకజానికి కేకేస్తున్నట్టు అరిచి మరీ ఇచ్చి వచ్చింది.

"సూడి దొంటలు... సూడి దొంటలు" అనుకుంటూ అరుగుదాటి వీధిలోకి వెళ్ళిపోయింది నారాయణమ్మ.

"ఏ పెనమయితే నాకేంటి? నాలుగొందలయాభై పెట్టి కొంటే మటుకు అందమీద నేనుగాని కూర్చుంటానా? అదో ఫేషను. పరువు. అందరూ కొనుక్కుంటున్నారు. రెండేళ్ళ క్రితం రెండొందల యాభై, ఇప్పుడో"? నాలుగొందల యాభై. మీ నాన్న ఇలాగే నసుగుతారు. నాన్చుతారు. అప్పుడు వెయ్యి రూపాయలై పోద్ది..." ఎన్నో సార్లలాగే ఆ సారి గొంతు చించుకుంది సావిత్రి.

సుబ్బారావు తలగోక్కున్నాడు.

పేలు దువ్వెన తెచ్చి ఇచ్చింది సునీత.

"ఇంటికెవరొచ్చినా ఎంత అప్రతిష్ట? ఎంత నామర్దా? అయినా కందకి లేని దురద కత్తిపీటకెందుకు? మగమనిషి మీకు లేని బాధ నాకెందుకు?" సావిత్రి తొలుగు మీది బట్టలు మడతలు విప్పి మళ్ళీ మడతలు పెడుతూ అంది.

"సరే కొందాం" అని సుబ్బారావు కుర్చీలోంచి లేచాడు.

"నాన్నా! ఇప్పుడు కొంటే అట్లతద్ది స్పెషల్ డిస్కౌంట్" సునీత అంది.

"మనం కూడా అట్లతద్దికి అట్లు పోసుకోవచ్చు" అందుకున్నాడు వినీత్.

"ఏ కంపెనీ బాగుంటుంది?" ఆలోచనలో పడింది సునీత

"ఆఁ... వీడియోకాన్ అట్లపెనం" వినీత్ ఠక్కున జవాబిచ్చాడు.

"ఆ కంపెనీది వుండదురా" నవ్వింది సునీత

"ఎందుకుండదు? ఫిలిప్స్ రేడియో టీవీలే కాదు మిక్సీలొచ్చాయా? మరేం?" ఒప్పుకోలేదు వినీత్.

"ఏదో ఒకటి" అరిచాడు సుబ్బారావు.

ఇల్లంతా నోరు మూసుకుంది.

ఆ రాత్రి పక్కమీద జుట్టు సర్దుతూ "ఏమండీ నాకు పండగకు చీరొద్దు" సుబ్బారావుతో అది సావిత్రి.

'ఇప్పుడు చీర నీకెవరు కొంటున్నారే?' అనబోయి 'మరి?' అని ఊరుకున్నాడు - ఏ గొడవొస్తుందోనని

"న...నాన్‌స్టిక్ కుక్‌వేర్..." కంఠస్థం చేసిన పదం ఒప్పజెప్పింది సావిత్రి.

సుబ్బారావుకి ఆవిడ ఇంగ్లీషు మాట్లాడడం ముద్దొచ్చింది. అంచేత మనస్ఫూర్తిగా అవునన్నాడు. తనకు కూడా చాన్నాళ్ళుగా కొనాలని వుందన్నాడు. చెయ్యి జరక్కే ఆలస్యమన్నాడు. అయినా ఇక ఆగేది లేదన్నాడు. అప్పు చేసయినా కొంటానన్నాడు. 'ఎన్నింటికి అప్పు చేయడం లేదు? అందులో ఇది ఒకటి!' భార్యకు చెప్పిన మాట తనకెందుకో ధైర్యాన్నిచ్చింది. ఆగలేక ఆ ఉత్సాహంలో 'కాకపోతే రోగవెుచ్చిందనుకుంటాం. రొష్టు వచ్చిందనుకుంటాం. డబ్బులు ఖర్చయిపోయాయనుకుంటాం' అన్నాడు.

"ఛీ.. ఛీ.. అర్ధరాత్రివేళ ఈ అపశకునపు మాటలేమిటండి. అయినా మీరు ప్రతిసారి హోటల్లో టిఫిన్ చేసొచ్చి - పేపరు దోసె.. ఉల్లిపార...అని రోజంతా బెగ్గురుగా ఇదయిపోవడం చూడలేక అన్నాను. అంతే. మర్చిపోయారా, ఆనాడు దేవతా వస్త్రాలు అల్లి అగ్గిపెట్టెల్లో దాచేవారు. ఈనాడలాగే దోసె.. చేటంత దోసె ... మడతపెట్టి ఒక్క గుక్కెట్లో అంగుట్లోకని... చరిత్ర చెప్పేసీవోరు. మీకంటా ఆ పసిపిల్లలు నయం. ఆ మాటకొస్తే నాకు తెలీదా మిమ్మల్ని చిన్నప్పుడు 'సోడి పిండట్టు' అని మీ జట్టు గాళ్ళంతా పిలిచే వారని అత్తమ్మ నాతో చెప్పింది".

సావిత్రి నోరుని సుబ్బారావు తన చేత్తో మూసేసాడు - పిల్లలు నిద్ర లేస్తారని చెప్పి.

ఒక పెద్ద అట్టుమీద సావిత్రీ పిల్లలూ తన తల్లీ తనూ అందరూ కలిసి కూర్చున్నట్టు - ఆ అట్టునే తింటున్నట్టూ - అంతా తినేసినట్టూ - తను లేపబోతున్నట్టూ - పక్కమీది నుంచి లేచినట్టు - లేచాక అది కలని సుబ్బారావుకి బోధపడినట్టు సావిత్రికి తెలిసిపోయింది.

"ఈ రోజన్నా పెనం తీసుకురండి. మీ అవస్థా పిల్లలవస్థా తీరిపోయినట్టు అట్లు పోసేస్తాను' ' అంది సావిత్రి జాలితో కూడిన బాధ్యత గుర్తుచేసుకుంటూ,

"పాత అప్పు తీర్చడమేల? కొత్త అప్పు చేయడమేలా?" ఈ కొత్త స్లోగన్‌తో కొత్త అప్పు పుట్టడం కష్టమవుతోంది. ఆ స్లోగన్ సుబ్బారావుదే మరి.

చే బదులు పుట్టదు. పుట్టినా గడువు చాలదు. కాలం కలిసి వస్తుంది. కాబట్టి అప్పు వడ్డీకి మాత్రమే! గడువిస్తే అప్పు పుట్టిస్తామన్నారొకరిద్దరు తోటి కార్మికులు. అట్లతద్ది డిస్కౌంట్ పోతుందని ఆఖరికి కంపెనీ గేటు బయట బడ్డీ పెట్టిన పైడమ్మ దగ్గర అయిదొందలు అప్పుచేసాడు. నెలకీ నూటికి పది చొప్పున - యాభై లెక్కన నెలనెలా కట్టీమంది. లేకపోతే చక్రవడ్డీ పడిపోతుందనీ అంది.

అవేవీ పట్టలేదు సుబ్బారావుకి. 'మొండి ధైర్యం చేస్తేగాని ఇలాంటివి కొనుక్కోలేమని' భార్యాభర్తలిద్దరూ ఒకే తీర్మానానికి వచ్చారు. ఆ సాయంత్రమే బజారుకు వెళ్ళి కొనుక్కొచ్చారు. రేపే అట్లతద్ది - ఆఖరు. 'ఇవాళ వచ్చి డిస్కౌంట్ కొట్టేసారు సార్' జాక్ పాట్ కొట్టినట్టుగా మెచ్చుకున్నాడు షాపువాడు. వాడి అభినందనలు అందుకొని ఆ దంపతులు ఆనందంగా ఇల్లు చేరారు.

ఆ మరుసటి రోజు కడుపునొప్పని ఆఫీసుకు లీవ్‌లెటరు పంపించాడు సుబ్బారావు. సావిత్రి కూడా మంచి హుషారుగా వుంది. పిల్లలకు బడులు ఎలాగూ సెలవే.

పొయ్యి చుట్టూ పెనం చుట్టూ ఇంటిల్లి పాదీ చేరారు.

"అమ్మా అటుకుల్లట్లు చెయ్యవే?" సునీత తను తీసుకొచ్చిన సన్డేమేగజైన్ తిరగేస్తూ అంది.

"ఎప్పుడూ చెయ్యలేదు. కంద అట్లు పొయ్యవే సావిత్రి" సుబ్బారావు తను చదివినది జ్ఞాపకానికొచ్చినది చెప్పాడు. వంటికీ మంచిదన్నాడు.

"అవేమట్లు?... అవే మట్లర్రా?... చక్కగా ఏ మినపట్టో పెసరట్టో చేసుకోక?" నారాయణమ్మ 'నారాయణ....నారాయణ' అని ఏకం ఆ నారాయుడ్నే తలచుకుంది.

"ఇప్పుడు అటుకులూ లేవు. కందా లేదు" సావిత్రి తెచ్చిన కొత్త పెనాన్ని ఆప్యాయంగా అప్పటికే డెబ్బైరెండోసారి తడిమింది.

"అమ్మా పుల్లగంజట్లు చెయ్యవే.." అప్పటిదాక - అట్లతద్ది స్పెషల్‌ని ప్రచురించిన ఓ పత్రికంతా తిప్పేసిన వినీత్ ఏకంగా తయారు చేసే విధానం చదవనారంభించాడు.

"అన్నం వార్చిన గంజిని బాగా మరగబెట్టి దించే ముందర ఉప్పు వేసి కొత్తిమిర, అల్లం, ఉల్లి, పచ్చిమిర్చి దిగువ ఇచ్చిన పాలలో...' ఇంకా చదవడం పూర్తి కాలేదు. నారాయణమ్మ అందుకుంది.

"ఆహాఁ...పాలేసి.....వెన్నేసి...జున్నేసి...అన్నీ ఏస్తే అది ఎవుడి కోసం రుచిగా రాదు? అనకూడదు తరవాణిలో ఏసినా అగ్గి జిగ్గులాగుంటాది...."

వినీత్‌కి కోపం వచ్చింది.

సునీతకి నవ్వొచ్చింది.

అంతవరకు ఉమ్మిగుటకలు మింగి మింగి ఆఖరకు "ఇవన్నీ ఎందుకు? సావిత్రీ సోడి పిండట్టు చెయ్యవే" నెమ్మదిగానే అన్నాడు సుబ్బారావు.

'అయ్యోరామ.... మరోనాడు పోస్తాలెండి.... అట్లతద్దినాడు సోడిపిండట్టా? ఎవరైనా ఇంటికొస్తే పరువుపోతుంది. పోరట్లు ఇవ్వడానికి పనికిరాదు. పీసుతనమని ఇరుగమ్మా పొరుగమ్మా ఆడిపోసుకోవడానికా?" సావిత్రి మాత్రం గొంతు తగ్గించలేదు.

"బాగా అన్నావ్ తల్లీ... గుద్దంట గుమ్మిడి కాయ వదిలీసి - కంటంట కాకరకాయ పట్టుకోడం...' ' కోడల్ని మెచ్చుకుంది నారాయణమ్మ.

"అయినా అయిదొందలు పెట్టికొని ఈ పెనం మీద సోడిపిండట్టా..? నేనొప్పుకోను...." సావిత్రి ససేమిరా అని తల అడ్డంగా వూపి, పెనాన్ని గుండెలకు హత్తుకుంది.

"ఆఁ... ఆఁ ... అయి... అయిదొందలే..?!" కళ్ళు తిరిగి పడిపోయినంత పనయింది నారాయణమ్మకు. గ్లాసుడు మంచినీళ్ళు తాగినా అర్దగంట దాక నోటంట మాట రాలేదు.

"అటుకుల్లట్లు"

"... కాదు గంజట్లు"

పిల్లలిద్దరూ అరుస్తూ వుంటే 'కందట్లు కందట్లు' అని సుబ్బారావు మధ్య మధ్యలో తాళం వేస్తున్నాడు.

"దమ్మిడీ మెంతులు... డెబ్బై తాలింపులు.. నా వల్ల కాదు" సావిత్రి గోడకు చేరగిలబడి ఒడిలో అట్ల పెనాన్నిడుకొని అలాగే కూర్చుండి పోయింది.

కొద్ది సేపటికి ఇల్లు చల్లబడింది. నారాయణమ్మ ఒల్లూ చల్లబడింది. అప్పుడే పంకజమొచ్చింది. 'ఈ పేను మీద దోసెలయితే బాగొస్తాయి." తీర్పు నిచ్చింది. కాని రవ్వదోసె. ఉల్లిదోసె, ప్లెయిన్ దోసె అంటూ రకాలు చెప్పి పేచి పెట్టి వెళ్ళిపోయింది.

సావిత్రి దోసెలు పోయడానికీ నిశ్చయించుకుంది.

ఎవ్వరూ ఏ దోసెలని అడగలేదు.

పొయ్యి ముట్టించి పెనం పెట్టింది. మళ్ళీ పంకజం వచ్చింది. దగ్గరుండి చూసింది.

"వదినా అస్సలు నూనె పీల్చడం లేదు చూడు" పంకజం అంది.

"అవునొదినా ఎంత ఆదా..." మురిసిపోయింది సావిత్రి.

నారాయణమ్మ తన పెదవి మూసి పళ్ళు పటపటమని కొరికింది. సుబ్బారావు ఆసక్తిగా చూస్తున్నాడు.

"అక్కా బాలెయ్యవే..." వినీత్ అట్లు తిరగేసుకొనే పల్చటి కర్ర కాడను దాని ఆకారాన్ని బట్టి బేటులా పట్టుకున్నాడు. నేలకాన్చాడు. చిన్నగా కొట్టాడు. అది చూడగానే సావిత్రి గుండెల్లో రాయి పడిపోయింది. పరుగెత్తుకెళ్ళింది. కొడుకు జుత్తందుకుంది.

"ఈడి క్రికెట్టు పిచ్చి మండిపోను. అయిదొందల రూపాయల అట్ల కర్ర ఇరిపిద్దువు కదరా' 'అని వెన్ను మీద అట్టు వేసి చేతిలోని కాడను అందుకుంది. తడిమి ఒకటికి రెండు సార్లు చూసుకుంది.

"మన ఇల్లల్లో జాకర్తగా వుండాలొదినా, గాజు సామాననుకో. చెయ్యి జారితే మరి మనకు దక్కదు." పంకజం వత్తాసు పలికింది.

"కర్ర పేడులాగుంది" తనలో తనే అనుకుంటూ పైకే అంది నారాయణమ్మ.

"కర్రపేడులాగుండడమేటి ఇదేటి కర్రే.." సావిత్రి చేతిలోని అట్లకాడను నారాయణమ్మ కళ్ళ ముందరెట్టింది.

తేరుకున్న నారాయణమ్మ "...నిజమేనోలమ్మ... ఇడ్డూరం గుడ్డెడితే తెల్లుల్లిపాయి పిల్లెట్టినట్టుగున్నాది..." సామెత పాడిచింది.

"వదినా దోసె మాడిపోతంది" అరిచింది సావిత్రి.

"నువ్వుండొదినా.. ఇదేమి ఇరవై రూపాయల మామూలు పెనమేటి? ఎంత అగ్గి పెట్టినా మాడదు గాక మాడదు. మాడితే అంత డబ్బు ఏల పొయ్యాల? అన్నట్టొదినా చెప్పడం మర్చిపోయాను. గేసు ఆదాకని ఈ పెనం రైల్వేరు బొగ్గు పొయ్యి మీద కర్రల పొయ్యి మీద పెట్టీకు. పెనం పాడయిపోద్ది.." అని అన్నీ చెప్పినాక అట్టు తిరగెయ్యబోయింది పంకజం.

మొండిపట్టు పట్టినట్టు దోసట్టు తిరగబడలేదు.

"ఇదేటొదినా తిరగబడ్డంలేదు..." సావిత్రికి ఆదుర్దాగా వుంది.

"వొదినీ నువ్వు కంగారుపడకు. అలవాటవ్వాలి కదా?" ధీమాగా తీరిగ్గా అంది పంకజం ఒక పక్క ప్రయత్నిస్తూనే.

'అలవాటు అట్ల పెనంకో అట్లుపోసినోళ్ళకో' అర్థం కాని నారాయణమ్మ కూర్చున్న చోటు నుండి లేచి వంగోని చూడ్డం మొదలు పెట్టింది.

'మాడుతున్న వాసనలాగుంది' అందరూ ముక్కుపుటాలు విదిలిస్తున్నా సునీత మాత్రం అంది.

"మాడ్డం కాదు... రోస్ట్ ... రోస్టు ... తింటే ... కరకరలాడుతుంది" అంటూ అప్పటికి దోసెని తీసింది పంకజం.

సుబ్బారావు సిగ్గుపడకుండా 'దోసె ముక్కని ఆత్రంగా నోట్లో పెట్టుకున్నాడు. చేదూ' అంటూ అక్ అక్‌మని ఇంట్లోనే ఊసేసాడు.

"అమ్మా నాన్న రమ్మంటున్నాడే" ఇంతలో పంకజం కొడుకు పిలుపు.

"గబారా అయితే ఇంతే... క్షణమాగలేరు కదా..." అంటూ పిలుపందుకొని పంకజం వెళ్ళిపోయింది.

అందరూ నోళ్ళు వెళ్ళబెట్టారు.

తర్వాత -

పొయ్యి మీది నుంచి పెనాన్ని దించింది సావిత్రి.

"ఆ మాడిన పెనం మీద పోస్తే మళ్ళీ మాడుతాయేమో?" సునీత అంది.

"మళ్ళీ తోమేసి పెట్టవే" సుబ్బారావన్నాడు.

నారాయణమ్మకు ఒళ్ళు మండుతోంది. ఏదో అనాలనుకొని ఎందుకోఆగి "అట్లతద్ది దాటిపోతోంది. పెద్దలకు ముద్దెప్పుడేస్తావ్? మన పాత ఇనుం పెనం మీదో... సిలవరి పెనం మీదో అట్లు పొయ్యి, ఈలోగ నేను తోముకొస్తాను" కోడలికి చెప్పి, పెనం పట్టుకొని పెరట్లోకి వెళ్ళింది.

ఉసూరుమంటూ పాత పెనాన్నే పొయ్యెక్కించింది సావిత్రి. పెనం కాలి అట్టుపోస్తున్నదల్లా ఉన్నట్టుండి ఒక్క సారిగా పెరట్లోకి పరిగెత్తింది. ఏమీ అర్థం కాని సుబ్బారావు కంగారుగా ఆమె వెంట పడ్డాడు. వెనకాతలే పిల్లలున్నూ.

"అత్తమ్మా..." అది సావిత్రిది పిలుపు కాదు అరుపు.

పెనాన్ని తోముతున్న నారాయణమ్మ గతుక్కుమంది. ఆమె చేతిలోని ఇసుక, బూడిద, [illegible] చింత అలానే వదలి నిలబడిపోయింది. నోట మాట రాక ఏమిటన్నట్టుగా చూసింది.

సావిత్రి నారాయణమ్మ చేతిలోని పెనాన్ని కడిగి చూసింది. నల్లని రంగులో ఉన్న పెనం మీద తెల్లని గీతలు. ఇసుక రగుడు గీతలు.

అంతే...

సావిత్రి కళ్ళలో నీళ్ళు బుడబుడమని ఉబికొచ్చాయి.

"ఎంతపని చేసావమ్మా..." సుబ్బారావు చెప్పలేనంతగా నొచ్చుకున్నాడు.

సునీత లోపలి గదిలోకి వెళ్ళి కొత్త పెనంతో పాటిచ్చిన పౌడరూ తెల్లటి స్పాంజి ముక్క తెచ్చింది.

"వీటితో తోమాలి నానమ్మా..." సునీత చెప్పింది.

"ఇలాటి పౌడర్లన్నీ సోకు ముస్తాబులకీ సొమ్ము చేసుకోవడానికి. లేపోతేటి పౌడర్లకీ అత్తర్లకీ అట్లపెనం మాడు వదుల్తాదేటే?.. ఇప్పుడు చూడు. చూడెలాగ పువ్వులాగ మెరిసిపోతందో పెనం' ' నారాయణమ్మ మాటలు పూర్తి కాలేదు.

"మెరిసిపోడం కాదే వెలిసిపోవడం... ఆ నల్లరంగు నూనె పీల్చకుండా కోటింగ్..." మొత్తుకున్నాడు సుబ్బారావు.

"మరి పౌడరయిపోతే ఏం చేస్తాం? ఎలా తోముతాం..." అనుమానాన్ని మించి అయ్యో అనుకోవడం లేదు నారాయణమ్మ.

"వాడే మళ్ళీ ... ఆ పెనం అమ్మిన వాడే అమ్ముతాడు.." సుబ్బారావు అరిచాడు.

"నా మీద అరుస్తావెందుకురా? నీకు బుద్ధి తక్కువ కాకపోతే ఈ పెనం ఎందుకు కొన్నావురా? పద్దుకు మాలిన పెనం కాకపోతే తోమితే కోటింగ్ వదిలి పోడమేటి? వెళ్ళి ఆ షావుకారి మీద అరు...." నారాయణమ్మకు రోషమొచ్చింది.

అత్తమాటల్ని అంతదాక ఓపిక పట్టి విన్న సావిత్రి మరి ఆగలేదు. "ఎన్నడెక్కనమ్మ గుర్రమెక్కితే ఏటవుతాది?" అంది.

"పళ్ళిరగ తంతాది. నీకే తన్నింది..." అంది నారాయణమ్మ.

"చూసారా చూసారా మీ అమ్మ మాటలు. వస్తువు పోతే నాదీ అన్నబాధ లేదు". గుండెలు బాదుకుంది సావిత్రి.

"ఎన్నడెక్కనమ్మ గుర్రమెక్కడమంటే ఏటర్థమో నీ పెళ్ళాన్ని అడుగురా. అంటే నేనెప్పుడూ ఈ ముష్ఠి పెనం చూడలేదనే కదరా... ఎంత మాటయితే అంత మాట ఇసురతంది" నారాయణమ్మ కొంగు బిగించి కొడుకునడిగింది.

"అసలు అంత ఖరీదు పెట్టి పెనం కొనడం చూడలేకపోతున్నావు. ఎవరైన బయటోళ్ళు ఉసూరుమంటారు. అలాటిది ఇంట్లోనే..." సావిత్రి తగ్గలేదు.

"నా కొడుకు సంసారం... నాక్కళ్ళగ్గసమేటి? అవును మరి నా కళ్ళు పడి ముష్ఠి పెనం మూడు ముక్కలయిపోయింది...." ఎత్తి పొడుపుగా అంది నారాయణమ్మ.

"అంటే... అంటే ముక్కలయిపోమనే గదా?"

అత్తా కోడళ్ళు చేతులు తిప్పుకున్నారు. అనరాని మాటలూ అనుకున్నారు. సుబ్బారావు ఎటూ చెప్పలేకపోయాడు. పిల్లలిద్దరూ కర్రగట్టుకు పోయినట్టు అలాగే నిలబడిపోయారు. ఇరుగూ పొరుగూ చేరారు. 'చొ...చ్చొ...చ్చో...' అని సానుభూతి కురిపించారు.

"మీరిద్దరూ ఈ దఫా తగువాడితే నేను బండికింద బుర్రెట్టేస్తాను. అప్పుడు మీకడ్డే వాడే వుండడు...." సుబ్బారావుకి సహనం నశించినట్టుంది.

అత్తా కోడళ్ళు నిశ్శబ్దమయిపోయారు.

పంకజం వచ్చి అక్కడ గుమికూడిన అందర్నీ పంపించేసింది. సావిత్రి చేతిలోని పెనాన్ని తీసుకొని మళ్ళీ పొడరు రుద్ది తోమి కడిగింది. పెనం ఆరబెట్టి మెత్తటి పొడిగుడ్డతో తుడిచి ఆనక దానిమీద నూనె రాసి పెట్టి గోడకు తగిలించమంది. ఆవిడ మళ్ళీ పెనిమిటి పిలుస్తున్నాడని వచ్చిన కొడుకుతో వెళ్ళిపోయింది.

పెనాన్ని ఫేను కింద ఆరబెట్టింది సావిత్రి.

మెత్తటి పొడిగుడ్డతో పెనం వళ్ళంతా అద్దుతూంది. అప్పుడే వినీత్ స్నానం చేసి వచ్చాడు. 'అమ్మా తుడవే' అన్నాడు. 'తుడుస్తున్నాను కదా' అంది సావిత్రి. పెనాన్నే జాగ్రత్తగా తుడుచుకుంది.

వినీత్ తన మట్టుకు తను తుడుచుకున్నాడు.

"అమ్మా తలకి నూనె రాయవే" జుట్టు వీరబోసుకుంటూ తల్లిదగ్గరకు వచ్చింది సునీత.

"నువ్వు రాసుకో వచ్చుగా, నేను పెనానికి రాస్తున్నాను గదా? నాకు వంద చేతుల్లేవు" కూతురుని కసురుకుంది. పెనం మీద నూనె చుక్కవేసి దాన్ని చేతివేలితో అతి సున్నితంగా రాసింది. అంతటా నూనె తడి అయ్యాక దాని కాడకూ సపర్యలు చేసింది.

"వంటగదిలో పొయ్యి వెనకాల గోడకో మూల కూచున్న పెనంకీ ఎన్ని సుప్పనాతి పనులో... అయినా నాకెందుకు..." తనకి తనే అనుకొని నారాయణమ్మ వీధి గడపలోకి వెళ్ళిపోయింది.

సుబ్బారావు ముఖం చూసి సావిత్రి నోరుమూసింది. కాని ఆమె ఆలోచనలు మూసుకుపోలేదు.

'...నిజమే... ఇంత డబ్బుపోసి ఇంటి వెనకాల పెట్టుకుంటే సుఖమేముంది? ఇలాంటి పెనముందని ఎవరు చూస్తారు? ఈ పెనమూ వంటగదిలో పెడితే వున్నా లేకపోయినా ఎవరికి తెలుస్తుంది? తెలియనిది వున్నా లేకపోయినా ఒకటే! టీవీ వున్న మధ్య గదిలోనే పెట్టుకోవాలి. పంకజం అలానే పెట్టింది. మహాలక్ష్మి అలాగే చేసింది..... అవును ఇది ఇంట్లోనే వుండాలి. ఆ గోడ గడియారం పక్క మేకు దిగ్గొట్టి తగిలిస్తే చక్కగా కనిపిస్తుంది....'

"ఏమండీ ఆ గడియారం పక్కనే పెద్ద మేకు కొట్టండి" సావిత్రి చెప్పింది.

"ఎందుకు?" సుబ్బారావుకి అర్థం కాలేదు.

"పెనం పెట్టుకోవడానికి..." సావిత్రి మామూలుగా చెప్పినా - సుబ్బారావు విని మామూలుగా వుండలేకపోయాడు.

"మన టీవి మీద పెడితే బాగుంటుంది.. అందంగా కూడా వుంటుంది" వినీత్ వ్యూహరచన చేసాడు.

"కాదు టేబిల్ మీద..." అంది సునీత.

సుబ్బారావు నోరు విప్పక ముందే సావిత్రి చెప్పింది. ఒక ఇంటి గురించి కాదు. ఆ వీధిలోని పది ఇళ్ళ గురించి. ఆ ఇళ్ళలోని అమరిక గురించి, అందం గురించి, చందం గురించి, చూడగానే కనపడేలా ఎక్కడయితే బాగుంటుందో చెప్పమంది.

సుబ్బారావుకి నోటంట మాట రాలేదు.

ఆయన చేతిలోకి సుత్తి, మేకు వచ్చింది. టేబులు ఎక్కించి గట్టిగా పట్టుకున్నారు... పిల్లలు.

మేకు దిగలేక దిగింది. పెనం గోడకు ఆప్యాయంగా చేరగిలబడింది. సావిత్రికి చూడముచ్చట వేసింది. గదిలోకి కొత్త అందమేదో వచ్చి కొలువు తీరి వున్నట్టనిపించింది.

చూడగా చూడగా సుబ్బారావుకీ పిల్లలకీ అందం కనపడింది.

పెనం వేళాడుతున్న మేకుకే దాని అట్ల కాడని నిలువుగా వేలాడ దీసారు. చూడ్డానికి అంకెల్లేని ఒకే పెద్దముల్లు కలిగిన గడియారంలా వుంది. ఎప్పటికప్పుడు గడియారం కంటే పెనాన్నే ఎక్కువగా చూసుకున్నారు ఇంటిల్లిపాదీ.

గడియారం మాత్రం పక్కనున్న పెనాన్ని పట్టించుకోలేదు. తన మన్నాన తను తిరుగుతూనే వుంది.

పెనం కూడా తిరగబోయింది. సావిత్రికి ఆపు చేయడం కష్టమవుతోంది.

"వదినా మా పెనం మీద మా అల్లుడి కళ్ళు పడ్డాయి. దాంతో నా కూతురు 'అమ్మా' అంటే కాదనలేకపోయాను. పెనం అత్తారింటికి పట్టుకుపోయింది. ఇల్లుబోసి పోయిందనుకో.." నిట్టూర్చింది పంకజం.

నిజమేనన్నట్టు జాలి ముఖం పెట్టింది సావిత్రి

"అవస్తే తీరలేదు మీ అన్నయ్యకు. మీ పెనమిద్దువు దోసెలు పోసుకు ఇచ్చేస్తాను..." పంకజం పెనం అడిగింది.

సావిత్రి 'అలాగే తీసుకెళ్ళు' అందే కాని పెనం తీసి ఇవ్వలేదు.

''నా దగ్గరుంటే నీకిచ్చేదాన్ను. ఎవులడిగితే ఆలకే ఇచ్చేదాన్ను. ఇప్పుడు అడగాలంటే నోరు రాడం లేదు...'' మళ్ళీ పంకజం మాట.

సావిత్రి గోడకు వేళాడుతున్న పెనం తీసి ఇచ్చింది.

పంకజం వెళ్ళాక నారాయణమ్మ అందుకుంది.

''అప్పుడెప్పుడో ఒక్క దఫా ఇచ్చిందని - పదీ దఫాలు తీసుకెళ్తంది. దాని మాటలు చూడు. ఎవులుదయితే ఆలకి బాధ తెలుసును. ఇంత మంచి పెనమూ సరి...'' గొణుగుతూనే వుంది.

''పెనం ఇంత ధర పెట్టి కొన్నాం వాడీసి పాడు చెయ్యడమేలా అనీసి - కొని రెండేళ్ళయినా నిండార నాలుగు దఫాలయినా వాడలే. ఆ పాత సిలవరి పెనమ్మీదే గైబుచ్చుకొస్తున్నాను...'' సావిత్రి ఎంతో కుంగిపోయింది. సుబ్బారావుకి తెలిస్తే తిడతాడని, ఇలాగే ఇంట్లోని సామానంతా పాడయిపోతోందని అంటాడని - పిల్లలకి ఆ మాట చెప్పవద్దనీది.

'పంకజానికిస్తన్నావు నా కివ్వవా' అని దమయంతి తీసుకెళ్ళేది. 'దమయంతి కిచ్చావు నా కివ్వవా' అని ధనలక్ష్మి తీసుకెళ్ళేది. ఇలా వంతులేసుకొని వంత పాడితే - సావిత్రి సాకులు చెప్పి తప్పించుకోలేకపోయింది. బైట పడింది. 'మరివ్వను' అని తేల్చి చెప్పింది. పెనం పాడయిపోయిందనీ చెప్పింది.

పంకజమే కాదు ధమయంతీ ధనలక్ష్మీ అందరూ మాట్లాడడం మానేసారు. సావిత్రికి పెనం గొడవ ప్రాణం మీదికి వచ్చింది. ఇరుగుపొరుగు చెయ్యిసాయమన్నా చేంతాడు దూరం వెళ్ళిపోయేవారు. పెనం ఊసులు చాటు పెట్టి చెప్పుకొనేవారు.

పెద్దల మధ్య పెనం ఊసులు పిల్లల మధ్య భాషలయ్యాయి!

ఇంట్లో పెద్దవాళ్ళు లేని సమయాన 'పెనం' మీద పెద్దగానే చర్చ జరిగింది. నాన్‌స్టిక్ కుక్‌వేర్ గురించి నలుగురూ నాలుగు మాటలనుకున్నారు. చివరికి ఒక్క మాటే మిగిలింది.

పెనం మీది అట్లు తీసే కాడ కర్రదా... కాదా?

కర్రదయితే ఎందుకు కాలిపోవడం లేదు?

ఎంత పరిశీలించినా ఫలితం దొరకలేదు. ఆఖరికి ఆ అతి పల్చటి అట్ల కాడని నోటిలో పెట్టుకొని కొరికాడు వినీత్. పుటుక్కుమని విరిగింది. ఒకరొకరు లాక్కొని అంతా తలో ముక్కా కొరికారు. కర్రదని తేలింది. కాని అలా 'జిగ్ జాగ్'లా ఎందుకయ్యిందో ఎంత ఆలోచించినా తేలలేదు సావిత్రికీ సుబ్బారావుకి. అసలు విషయం అంతు చిక్కలేదు.

నారాయణమ్మా ఆలోచించింది. అందక వాసనా చూసింది. అప్పుడు తేల్చి చెప్పింది.

''ఇది ఎలకలు చేసిన పనే. ఆటి పళ్ళ గాట్లు ఇకాదా?''

నాయినమ్మ డిస్కవరీ వినీత్‌కి బాగా నచ్చింది.

సావిత్రి మొర్రోమని తలబాదుకొంది. ఆవేశం పట్టలేని సుబ్బారావు అర్జెంటుగా బజారు కెళ్ళి ఎలుకల మందు తెచ్చి ఇల్లంతా వాయినాలు పెట్టాడు.

పెనం గోడ దిగింది.

పొయ్యి మీద ఎక్కింది.

కాలుతోంది గుండెల్లో నిప్పు పెట్టినట్టు.

"లోన్ పెట్టి గుండెల మీది 'పెనం' దించుకోవాలి" అన్నాడు సుబ్బారావు

"మూడేళ్ళయిపోయింది..." సావిత్రికి ముచ్చెమటలు పోసాయి.

"పిల్ల ఎదిగి ఏడాదే కాలేదు" నారాయణమ్మ మనమరాలి పెళ్ళి విషయమేమోననుకొని అడిగింది.

"పిల్ల పెళ్ళి కాదు. పెనం కోసం చేసిన అప్పు" చెప్పాడు సుబ్బారావు. అతగాడి కళ్ళ ముందు పైడమ్మ ముఖం. ఆ ముఖంలో గీతల్లాగే లెక్కలు. నెలకి - అయిదొందలకి - యాభై చొప్పున సంవత్సరానికి ఆరొందలు వడ్డీ. అసల్ని దాటింది. అలాగ మూడేళ్ళు. పద్దెనిమిదొందలు, అసలు అయిదు వందలు. చక్రవడ్డీకి వందలకి వందలు... మొత్తం మీద వేలు!

పెనం ఎర్రగా కాలుతోంది. చూడ్డానికి అదే ఓ అట్టులా కనిపించినా ఎవ్వరూ దాన్ని ముట్టుకోవడానికే భయపడ్డారు.

సుబ్బారావు నుదిటకు పట్టిన చెమటను అరచేత్తో తుడిచి చెయ్యి విదిల్చాడు. తుళ్ళిన చెమట చుక్క కాలుతున్న పెనం మీద పడి పేలిపోయింది.

సావిత్రి పెనం మీద నూనె వేసింది. బాగా ఎప్పట్నుంచో పుటంలా కాలుతోందేమో నూనె పడ్డంతోనే పెనం భగ్గుమంది. పెనం కిందే కాదు పెనం మీదా అగ్గే!

★ ★ ★

*ప్రచురణ : 20 జనవరి - 5 ఫిబ్రవరి '97 సుప్రభాతం*

***రచనా కాలం :** 07 నవంబరు '96*